క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన తండావాసులు



పర్వతగిరి : మండలంలోని మంగ్త్యవాల్యతండాకు చెందిన గిరిజనులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2022లో ఉపాధి హామీ కూలీలతో నీటికుంట నిర్మాణం చేపట్టగా దాని గురించి 2023లో ప్రధాన మంత్రి మోదీ మన్ కీ బాత్‌లో ప్రసంగించగా ఈనెల 26న జరగనున్న గణతంత్ర వేడుకల్లో ప్రధానమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్న సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు కలవగా వారిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, కుసం రాంచంద్రారెడ్డి, పార్టీ అధ్యక్షులు బానోతు రమేశ్, వెంకటేశ్వర్లు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయుల సమక్షంలో టీచర్లుగా వ్యవహరించిన విద్యార్థులు ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు జయప్రకాశ్, రమేశ్, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సభలకు విఘాతం'



వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామ సభలకు బీఆర్‌ఎస్ నాయకులు విఘాతం కలిగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన తప్పులను సరిదిద్దే క్రమంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో భాగంగా సభలు నిర్వహిస్తుండగా అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, కుల్ల యాకాంతం పాల్గొన్నారు.

'పథకాలతో రాజకీయ పబ్బం గడుపుతున్నారు'

పర్వతగిరి : కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, తదితర పథకాలను అడ్డం పెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిందుకే ప్రజలు ఓట్లు వేయకపోతే పథకాలు రావన్న అపోహలు సృష్టిస్తున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ ఎంపీపీ లూనావత్ కమల పంతులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ యుగంధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'తప్పుదోవ పట్టించే కుట్ర'

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించుకే కుట్ర చేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు తీసుకుని గ్రామసభలు నిర్వహించి కేవలం పేర్లు మాత్రమే చదివి వినిపిస్తున్నారు తప్ప ఓ ఒక్కరికి కూడా మంజూరీ పత్రం ఇవ్వలేదని మండిపడ్డారు. సభలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. సమావేశంలో నాయకులు గోపాల్‌రావు, ఎలేందర్‌రెడ్డి, రాజమణి, అనిత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే..

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తూ ఆర్భాటం చేస్తోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ యువజన, ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పటికీ ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. పేదలకు ఇళ్లు, స్థలాలు అందకపోగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని తెలిపారు. గ్రామసభల్లో అధికార పార్టీ, నిరసనల పేరుతో ఉనికి కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. సమావేశంలో నాయకులు కుక్కల యాకయ్య, మోటం సురేశ్, బండారు మల్లేశ్, బంగారి సందీప్, కసుబాల సతీశ్, ఖాజా, రాజు, శివ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. నిరసనలు, వాగ్వాదాల నడుమ శుక్రవారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డుసభలు కొనసాగాయి. నర్సంపేట మండలంలోని గురిజాలలో జరిగిన సభకు ఎమ్మెల్యే మాధవరెడ్డి హాజరై ప్రసంగించారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేళ్లపాటు ప్రజలు రేషన్ కార్డులకు సైతం నోచుకోలేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమానికి అవసరమైన కార్యాచరణ చేపడుతోందని తెలిపారు. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటలో సభకు డీఆర్‌డీఓ కౌసల్య, ఇతర మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల బాహాబాహీ

ఖానాపురం మండలంలోని కొడ్తిమాటుతండాలో జరిగిన సభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బాహాబాహీకి దిగారు. జాబితాలో 28 మంది వివరాలు ఉండగా సభలో 8 మంది పేర్లు మాత్రమే చదవడంతో బీఆర్‌ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. రైతుభరోసా జాబితాను ఏఈఓ చదివి వినిపిస్తుండటంతో 16 మంది వివరాలు రాకపోవడంతో గత ప్రభుత్వంలో ఎందుకు రాలేదని అధికారులను కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్. కాంగ్రెస్ నాయకులు కుర్చీలు విసురుకోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు అశోక్, నరేష్, ప్రవీణ్, భద్రు, వెంకన్నలకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై రఘుపతి ఇరువర్గాలను చెదరగొట్టారు.



ఖానాపురం : ఘర్షణలో విరిగిన కుర్చీలు



నర్సంపేట రూరల్ : సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దివిటిపల్లిలో వెలవెల..

వర్ధన్నపేట మండలంలోని దివిటిపల్లిలో ప్రజలు హాజరు కాకపోవడంతో సభ వెలవెలాబోయింది. అధికారులు, సిబ్బంది గ్రామస్తుల కోసం ఎదురు చూసిన పరిస్థితి నెలకొంది. చాలా సేపటి తర్వాత కొంత వరకు జనం సభకు హాజరయ్యారు.

బీటీ రోడ్డు గుంతలమయం

- ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

సంగెం : మండలంలోని మచ్చాపూర్ నుంచి చెన్నారావుపేట మండల కేంద్రం వరకు ఇటీవల నిర్మించిన బీటీ రోడ్డు అనతికాలంలోనే పగుళ్లు వచ్చి గుంతలమయం అయ్యింది. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డుపై పల్లారుగూడ, మొండ్రాయి గ్రామాల వద్ద కల్వర్టు సమీపంలో పలుచోట్ల పగుళ్లు వచ్చి గుంతలు పడ్డాయి. కొత్తగా నిర్మించినప్పటికీ రోడ్డుపై గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. ఈ దారి మీదుగా ప్రయాణించే వాహనదార్లు కుదుపులతో నడుం దెబ్బతిని అనారోగ్యం బారిన పడుతుండగా వాహనాలు చెడిపోతున్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

మచ్చాపూర్ నుంచి పల్లారుగూడ, మొండ్రాయి గ్రామాల మీదుగా చేపట్టిన రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాసిరకంగా పనులు చేపట్టడం వల్లే రోడ్డు నిర్మించిన మూన్నాళ్లకే పలుచోట్ల పగుళ్లు వచ్చి గుంతలు పడ్డాయని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే రోడ్డు అనతికాలంలోనే దెబ్బతిన్నదన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి.



రోడ్డుపై పగుళ్లు, గుంతలు

త్వరలో మరమ్మతులు చేయిస్తాం

బీటీ రోడ్డుపై గుంతలు పడిన మాట వాస్తవమే. నాణ్యత ప్రమాణాలతోనే రోడ్డు నిర్మాణం చేపట్టాం. గుంతలు పడిన చోట బీటీ పోసే ముందు రోజు జియోఫైబర్ ప్రతినిధులు తవ్వకాలు చేపట్టి పూడ్చివేశారు. దానిపైనే బీటీ వేయడంతో గుంతలు పడ్డాయి. త్వరలోనే మరమ్మతులు చేయించి గుంతలు లేకుండా చూస్తా.

– షఫీయుద్దీన్, ఏఈ, ఆర్ అండ్ బీ

పట్టణ అభివృద్ధికి ఎనలేని కృషి

- ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

వర్ధన్నపేట : పట్టణ అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఎనలేని కృషి చేశారని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ. వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు సమావేశపు హాలులో శుక్రవారం ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి ముఖ్య అతిథులుగా పాల్గొని వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. 2018లో వర్ధన్నపేట మున్సిపాలిటీ ఏర్పడగా 2020లో పాలకవర్గం ఎన్నికై బాధ్యతలు స్వీకరించగా కరోనా మహమ్మారితో పాలనలో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చైర్‌పర్సన్, కౌన్సిలర్లు పార్టీలోకి వచ్చి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అనంతరం పాలకవర్గాన్ని సన్మానించారు. సమావేశంలో కమ్మగోని ప్రభాకర్, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

కౌన్సిలర్ల అలక

వీడ్కోలు సమావేశానికి చైర్‌పర్సన్‌తోపాటు ఐదుగురు కౌన్సిలర్లు హాజరు కాగా మిగతా ఆరుగురు గైర్హాజరయ్యారు. వారికి ముందస్తు సమాచారం ఇవ్వలేదని, 20 గంటల ముందే మొక్కుబడి తెలిపినట్లు తెలిసింది. ఐదుగురు కౌన్సిలర్లు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండి సమావేశానికి హాజరు కాలేదు. మరో కౌన్సిలర్ సమాచారం అందే లోపే స్థానికంగా లేడని తెలిసింది. సమావేశం ముగిసే సమయంలో కమిషనర్ సుధీర్‌కుమార్, చైర్ పర్సన్ కిందకు వచ్చి వారిని బుజ్జగించి కార్యక్రమానికి తీసుకెళ్లారు.

ఐఎన్‌టీయూసీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా విక్రమ్



వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన న్యాయవాది బండారి విక్రమ్‌ను ఐఎన్‌టీయూసీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి బుద్ధారం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో విక్రమ్ మాట్లాడారు. కార్మికులకు విధాన పరమైన అన్యాయం జరిగినా లేదా లేబర్ కార్యాలయంలో లేదా ఇతర కార్యాలయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా తనను సంప్రదిస్తే పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన మేడి వీరమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెకు వైద్యం కోసం మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, ఉప్పరి వీరస్వామి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కన్నం సందీప్, తాళ్ల సమ్మయ్య, మేడి సంతోశ్, కుండే భద్రయ్య, అబ్బదాసి యాకయ్య, ముర్రి వీరస్వామి, కన్నం కుమార్, మేడి సాయి, వినోద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రాంరాజ్

నర్సంపేట : బాలికలు చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని బాలాజీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రాంరాజ్ ఆకాంక్షించారు. ఆ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఏటా జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో లింగ సమానత్వం సాధించడమే ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. బాలికల అభివృద్ధికి అవరోధాలుగా సమాజాన్ని పీడిస్తున్న భ్రూణహత్యలు, బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, తదితర రుగ్మతలను రూపుమాపడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు రవీందర్, మధు, రాజ్‌కుమార్, సురేశ్, ప్రవీణ్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో..

పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి హెచ్‌ఎం కాంతారావు అధ్యక్షత వహించగా స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ఆపద సమయంలో ఆడపిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సుశీల, ఉపాధ్యాయులు నిర్మల, అరుణకుమారి, వాణి, రాధిక, సుజాత, స్వరూప, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలులో రేవంత్‌రెడ్డి విఫలం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : ఏడాదిలో లేకలేక గ్రామసభ పెడితే రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రజల నిలదీతలే కన్పిస్తున్నాయని, ఆరు గ్యారంటీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని మైలారంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలోనే ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఇన్నాళ్లు ఎదురు చూసిన ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. గ్రామసభల్లో అధికారులను నిలదీస్తే సమాధానాలు చెప్పాల్సింది పోయి దురుసుగా ప్రవర్తించడమేంటని ప్రశ్నించారు. దావోస్ వెళ్లి హైదరాబాద్‌లోని కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవడమేంటని ప్రశ్నించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

మాజీ కౌన్సిలర్‌పై హత్యాయత్నం అమానుషం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్‌ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ శివరాత్రి వెంకటమ్మ స్వామి దంపతులపై కాంగ్రెస్ గూండాలు గురువారం సాయంత్రం చేసిన హత్యాయత్నం అమానుషమని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మాజీ కౌన్సిలర్ వెంకటమ్మస్వామి కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో టీయూఎఫ్‌డీఐసీఓ ద్వారా మంజూరైన నిధులతో టెండర్లు పూర్తయి పనులు చేస్తున్న 20 మంది కాంట్రాక్టర్ల అగ్రిమెంట్లను స్థానిక ఎమ్మెల్యే తన సొంత ఏజెన్సీ కాంట్రాక్టర్లకు ఇప్పించడం అధికార దుర్వినియోగమే అన్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా శివరాత్రి వెంకటమ్మ ఇంటి గోడ కూల్చే కుట్ర చేసి మున్సిపాలిటీ అధికారుల అనుమతులు, మాటలను బేఖాతరు చేసి కాంగ్రెస్ గుండాలు వారిపై దాడి చేయడం అక్రమం అన్నారు. మహిళపై విచక్షణ రహితంగా దాడి చేస్తుంటే పోలీసులకు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. దాడి చేసిన వారిని వదిలేసి దెబ్బలు పడిన వారిపై కేసు పెట్టడం నర్సంపేట పోలీసులకు మాత్రమే చెల్లిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మాజీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, క్లస్టర్ బాధ్యులు రమేష్, కౌన్సిలర్ సదానందం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు దుశ్యంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్వామితో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఎగ్జామ్ ప్యాడ్‌ల అందజేత

సంగెం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను దాతలు పసునూటి ఆనంద్, బొజ్జ సురేశ్, ఉండీల మల్లికార్జున్, పడాల శ్రీకాంత్ శుక్రవారం అందజేశారు. అనంతరం దాత, తిమ్మాపూర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఆనంద్ 2024–25 విద్యాసంవత్సరం ఫైనల్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.2 వేల 116, ద్వితీయ బహుమతి వెయ్యి 116 రూపాయలు ప్రకటించి ప్రిన్సిపాల్ మాధవరావుకు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్లు రాజ్‌కుమార్, సుధీర్‌కుమార్, సీనియర్ అధ్యాపకులు విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్స్, రాగిజావ కప్స్..

మండలంలోని మొండ్రాయి హైస్కూల్ విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు బుగ్గారపు రామకృష్ణ వాటర్ బాటిల్స్, రాగిజావ కప్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ అనుముల శ్రీలత, స్టాఫ్ సెక్రటరీ మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్ స్కూల్‌లో..

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ ప్రభుత్వ స్కూల్‌లో పూర్వవిద్యార్థులు నీలారపు రాజేందర్ విద్యార్థులకు టై, బెల్టులు, శ్రీనివాసచారి పదో తరగతి టాపర్లుగా నిలిచిన స్ఫూర్తికి రూ.3 వేలు, స్వస్తిత, వెంకటసాయిలకు రూ.వెయ్యి చొప్పున బహుమతి అందజేశారు. అనంతరం రాజేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, బ్రహ్మం, పూర్వవిద్యార్థులు ఉప్పలయ్య, రత్నసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ఖానాపురం : ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గౌస్ పాషా (52) గురువారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి క్రాస్ రోడ్డు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు గూడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం నర్సంపేట ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమిస్తుండడంతో వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించారు. కాగా గౌస్ పాషా పరిస్థితి విషమించి మృతి చెందాడు. గౌస్ పాషా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుమారుడు యాకూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాల్‌తండాలో..

ఖానాపురం : మండలంలోని బాల్‌తండాకు చెందిన ఎర్రనాగుల అచ్చమ్మ (56) ఈనెల 10న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకుంది. అనంతరం ఆరోగ్యం క్షీణించి మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు. అచ్చమ్మ భర్త మంగ్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అచ్చమ్మ మృతదేహానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

భారీగా గుట్కా ప్యాకెట్ల పట్టివేత



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం శివారులోని హోల్‌సెల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని పలు షాపుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి రూ.3.18 లక్షల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుట్కా నిల్వ ఉంచిన వ్యాపారులను అదుపులోకి తీసుకుని విచారణ కోసం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో రిజర్వేషన్ కల్పించాలి

నల్లబెల్లి : ఇందిరమ్మ ఇండ్ల మంజూరీలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) మండల అధ్యక్షుడు పులి రమేశ్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో ఎంపీడీఓ నర్సింహమూర్తికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుండారపు రమేశ్, గువ్వ రఘువర్ధన్, జన్ను రాజయ్య, మామిండ్ల రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వర్ధన్నపేట : పట్టణంలో తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు బొడ్డుపెల్లి సాయిలు, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. రజకులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, 50 ఏళ్లకుపైబడిన వృత్తిదారులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టిప్పర్ల సీజ్

సంగెం : ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. మండలంలోని తీగరాజుపల్లి నుంచి చింతలపల్లి వద్ద ఉన్న రైల్వే పనులకు అక్రమంగా మొరం తరలిస్తుండగా టిప్పర్లతోపాటు డ్రైవర్లు తోకల కమలహసన్, సోను కుమార్ షాలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

పర్వతగిరి : మండలంలోని పెద్దతండా, సీత్యతండా, మోత్యతండా, గుగులోతుతండా, చింతనెక్కొండ గ్రామాల్లో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి 25 లీటర్ల నాటుసారా, 200 కేజీల నల్లబెల్లం, 30 కేజీల పటిక, 20 కేజీల చక్కర, మొబైల్ స్వాధీనం చేసుకుని 700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ చందర్, ఎస్సై సరిత, హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుళ్లు రమేశ్ వంశీకృష్ణ, పరశురాం, సంతోశ్, రాజమౌళి పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని చెరువుముందు తండా నుంచి చెన్నారావుపేటకు నాటుసారా తరలిస్తున్న బానోతు రాజేందర్, బానోతు ఈర్యలను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ నర్సంపేట సీఐ నరేశ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 15 లీటర్ల నాటుసారాతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పెద్దకోర్పోలు నుంచి అలంకానిపేట తరలిస్తున్న 15 లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని జర్పుల చందులాల్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. ముగ్గరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై శార్వాణి, రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.



పర్వతగిరి : స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పేదలకు సేవలే 'ఎస్‌ఆర్‌ఆర్' ధ్యేయం

- ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : పేదలకు సేవలు అందించడమే ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని వ్యవస్థాపక చైర్మన్, బీఆర్‌ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బురహాన్‌పల్లి, కాట్రపల్లి, మొరిపిరాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం టై, షూ, బెల్ట్, దుస్తులు అందజేశారు. అనంతరం మొరిపిరాలలో బొడ్రాయి, మైలారంలో పండుగల నిర్వహణ కోసం రూ.50 వేలు చొప్పున అందించారు. తదనంతరం పెర్కవేడులో ఈనెల 26న గణతంత్ర దినోత్సవ క్రీడల కోసం రూ.10 వేలు అందజేసి మాట్లాడారు. మండల ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపెల్లి సంతోశ్, లేతాకుల రంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, యూసుఫ్, గజవెల్లి ప్రసాద్, మహేందర్‌రెడ్డి, కోల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలే లక్ష్యం

నర్సంపేట : ఎస్సీ వర్గీకరణ అమలే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ తెలిపారు. ఎంఎల్‌ఎఫ్ సంఘీభావ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్‌కు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో డివిజన్ నాయకుడు బొట్ల పవన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రణయ్‌దీప్ మాట్లాడారు. ప్రపంచానికి ఎస్సీ వర్గీకరణ గోడు వినిపించేలా హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న లక్షల డప్పులు, వేల గొంతుల ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు కొంగర రాజు, కందికట్ల వీరేశం, మిట్టగడపల కృష్ణ, మహంకాళి ప్రభాకర్, దూడల సాంబయ్య, రాజు, రవి, సూరి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్ తల్లి నర్సమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్ శుక్రవారం పరామర్శించారు. తొలుత నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సమ్మ మృతి బాధాకరమన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి నర్సింహరాములు, గుడిపూడి రాధాకృష్ణ, కట్ల రాంచంద్రారెడ్డి, కొంపెల్లి రాజేందర్, గంగిడి మహేందర్‌రెడ్డి, రాంచందర్, జుర్రు రాజు, గూడూరు సందీప్, కూనమల్ల పృధ్వీరాజ్, ఠాకూర్ రవీందర్ (చిన్న). ఠాకూర్ నాగరాజు, శీలం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.